క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



నీటి తొట్టెను శుభ్రం చేయిస్తున్న అధికారులు

యాడికి: పరిసరాలను పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రెండో సచివాయం సమీపంలో ఉన్న రాఘవేంద్ర కాలనీలో ఆరోగ్య సిబ్బంది మలేరియా మాసోత్సవ అవగాహన కార్య క్రమం నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి



తిమ్మంపేట సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గార్లదిన్నె: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య సూచించారు. సోమవారం మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనాలు ఆపి, రికార్డులు పరిశీలించారు.రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమాన విధించారు కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయాలకు సన్మానం

గుత్తి: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయాలను సోమవారం హెచ్ఎం సుంకన్న, ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను ఆయాలు రోజూ శుభ్రం చేసున్నారు. ఈక్రమంలో ఆయాలు శివమ్మ, జయమ్మ, సుభాషిణి,నారాయణమ్మలతో పాటు వాచ్‌మెన్ రామాంజనేయులును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

'సేవ్ ఆర్టీటీ' రిలే దీక్షలు ప్రారంభం



రిలేదీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు, ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్‌తో పాటు పలువురు రిలే దీక్షలో కూర్చొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం రిలే దీక్షలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీ వరప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాకుందాం

శింగనమల: పేద ప్రజల కల్పతరువైన ఆర్డీటీని కాపాడుకోవడమే లక్ష్యం కావాలని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి అన్నారు. సోమవారం శింగనమలలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాకే రాజు, శ్రీనివాసులు, రాజు, శివమూర్తి, పుష్ప, రామాంజినేయులు, శశికళ, శ్యాం, హనుమంతు, నాగేంద్రమ్మ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శంకర్

పెద్దవడుగూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ శంకర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ పని తీరు గురించి ఆరా తీశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సేకరించిన చెత్తను ఎలా వినియోగిస్తున్నారనే అంశాలను గురించి ఆరా తీశారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారన్‌సాహెబ్, ఈఓఆర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కు చెందిన వంశీ అనే వ్యక్తిపై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళడంతో.. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం

- నకిలీ మేనిఫెస్టోతో ప్రజలను బురిడీ కొట్టించారు
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్





బుక్కరాయసముద్రంలో నాయకులతో కలసి క్యూ ఆర్ కోడ్ విడుదల చేస్తున్న మాజీ మంత్రి శైలజానాథ్, యల్లనూరులో మాట్లాడుతున్న శైలజానాథ్

యల్లనూరు: అలవిగాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి రాగానే అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. సోమవారం యల్లనూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జెడ్పీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి నివాసంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా విస్తృత స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ ఉచిత పథకాలు అమలు చేస్తామని చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాల అమలును మరచిపోయారన్నారు. ఎన్నికల హామీలను మరచి.....ప్రజల్లో ఎలా వస్తారని ప్రశ్నించారు. నైతిక విలువలున్న ఏకైక నాయకుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఉచిత గ్యాస్, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు నెలకు 1500 చూయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి పూర్తిగా అమల్లోకి రాలేదన్నారు. అనంతరం మేనిఫెస్టోకి సంబంధించిన పోస్టర్ల స్కానర్‌ను విడుదల చేశారు. ప్రతి గ్రామంలో తెలుగు దేశం పార్టీ మేనిఫెస్టో మోసాలపై ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పద్మావతమ్మ, బుక్కరాయ సముద్రం జెడ్పీటీసీ భాస్కర్, ఉప సర్పంచు సూరి, నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, పాతపల్లి ప్రభాకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, నిట్టూరు నాగేంద్ర, శ్రీనివాసులరెడ్డి, బాషా, గడ్డంవారిపల్లి రామకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, తిరుమలాపురం కృష్ణారెడ్డి, రవి చంద్రారెడ్డి, వేములపల్లి ప్రతాప్‌రెడ్డి, యల్లనూరు జాఫర్, హాజీవలి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపద్దాల పాలన

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో చంద్రబాబు రిపాలన అపద్దాలతో సాగుతోందని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రలోని లక్ష్మీ నారాయణస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శైలజానాథ్ హాజరై మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడన్నారు. అయితే అధికారం చేతికి వచ్చాక ప్రజా సమస్యలను విస్మరించారన్నారు. ఏం సాధించారని రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలన కార్యక్రమం చేస్తున్నారని ప్రశ్నించారు. పరిపాలన అంతా మోసం, దౌర్జన్యాలు, అక్రమాలు తప్పా చేసిందేమీ లేదన్నారు. యువతకు నిరుద్యోగ భృతి, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలా నెలా రూ.1500 ఇస్తామని మోసం చేశారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, బాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ భాస్కర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, నాయకులు నరేష్, పూల నారాయణ స్వామి, వెంకటరెడ్డి, చికెన్ నారాయణస్వామి, ముసలన్న, అంజి, అనంత, లక్ష్మిరెడ్డి, నందినేని మల్లికార్జున, కాటమయ్య, బయపరెడ్డి, పురుషోత్తం , చంద్ర, సాకే లక్ష్మి నారాయణ, నందినేని సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

నార్పల/శింగనమల/గార్లదిన్నె: నార్పల మండల కేంద్రంలోని వాల్మీకి దేవాలయంలో ఉదయం 10 గంటలకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఖాదర్‌వలీఖాన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే శింగనమలలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించే రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ తెలిపారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిలో స్టార్ ఫంక్షన్ హాల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమాలకు శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు

అంధురాలి కథ సుఖాంతం



అంధురాలిని ఆటోలో బంధువుల చెంతకు తరలిస్తున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఈఓ సుబ్రమణ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో 18 రోజులుగా నడవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అంధురాలు సంజమ్మ కథ సుఖాంతమైంది. ఆమె గురించి ఈ నెల 10న సాక్షిలో అంధురాలిని పట్టించుకునేవారేరీ అనే వార్త కథనం ప్రచురితమైంది. ఆ వార్త వెలువడిన మరుసటి రోజే ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆమె దగ్గరకు వెళ్లి కుటుంబసభ్యుల చెంతకు చేరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఎస్ఐతో పాటు, ఈఓ సుబ్రమణ్యం, గ్రామస్తుడు పాముల ఆది వృద్ధురాలిని యల్లనూరులోని సంజమ్మ అక్క చెంతకు ఆటోలో తరలించారు. వృద్ధురాలు ఇంటికి చేరడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పొడగింపు

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 20 వరకూ గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ బద్రీనాథ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 22వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ఈ నెల 23 నుంచి 25 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

తాగునీరు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి: పట్టణంలోని జడ్ వీరారెడ్డి కాలనీలో తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులతో కలసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, మాజీ కార్యదర్శి రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ మాట్లాడారు. జడ్ వీరారెడ్డి కాలనీలో తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కారం చేయాలని పలు సార్లు కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశామన్నారు. అయితే ఇంతవరకూ సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రేణుక, మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.

'వైద్యుడిని వెనక్కి రప్పించండి'

గుంతకల్లుటౌన్: రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి డెప్యుటేషన్‌పై పంపిన డాక్టర్ మల్లికార్జునను వెనక్కి రప్పించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావును సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సూపరింటెండెంట్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న వైద్యుల స్థానాలను భర్తీ చేయక పోగా ఉన్న వారిని డెప్యుటేషన్‌పై పంపడం సరికాదన్నారు.

మొహర్రం ప్రశాంతంగా నిర్వహించుకోండి

తాడిపత్రిటౌన్: మొహర్రంను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని కోమలి గ్రామంలో ఆయన సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పండగను నిర్వహించుకొవాలన్నారు. ఏదైనా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

యువకుడిపై వేటకొడవలితో దాడి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో టైలర్స్ కాలనీకి చెందిన హర్ష అనే యువకుడిపై సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆరుగురు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై వచ్చి తలపై వేటకొడవలితో నరికారు. నరికిన తర్వాత వారు పారిపోయరని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన హర్షను ఆసుపత్రికి తరలించారు.

విషవాయువు పీల్చి బాలిక మృతి

తాడిపత్రిటౌన్: మండలంలోని బందర్లపల్లెకు చెందిన సాయిప్రియ(14) సోమవారం అనంతపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె సాయిప్రియ విష గుళికలు కలిపి ఉంచిన శనగ విత్తనాలు ఉన్న గదిని తెరిచి విషవాయువు పీల్చి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా బాలిక బ్రాహ్మణపల్లె ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదువుతోంది.

గోల్డ్ స్కీమ్ పేరిట చీటింగ్

గుంతకల్లు టౌన్: గోల్డ్ స్కీమ్ పేరిట గుంతకల్లుకు చెందిన జ్యువెలరీ షాప్ నిర్వాహకుడు నూరుల్లా రూ.లక్షల్లో కుచ్చుటోపీ పెట్టి ఉడాయించాడు. విషయం తెలియగానే బాధితులు పెద్ద సంఖ్యలో సోమవారం సాయంత్రం పాత గుత్తిరోడ్డులోని సుల్తానియా జ్యువెలరీ షాపు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. జ్యువెలరీ షాపును అద్దెకిచ్చిన యజమాని ఖాళీ చేయిస్తామని అక్కడికి వెళ్లడంతో బాధితులంతా వాదించారు. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం బంగారు షాపు నిర్వాహకుడు నూరుల్లాకి తాము పోగు చేసుకున్న డబ్బును నెలానెల చెల్లించి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అతడిని ఇక్కడికి రప్పించి తమ డబ్బును తమకు ఇప్పించాలని బాధితులు కోరుతూ ఆర్డీఓ, టూటౌన్ పోలీసులను కలసి విన్నవించారు.

తప్పల తడకగా 'తల్లికి వందనం'



ఉపాధ్యాయిలను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తండ్రులు

గుంతకల్లు రూరల్: పాఠశాల సిబ్బంది తప్పిదం కారణంగా ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం నిధులు అందకుండా పోయాయని, తప్పుచేసిన సిబ్బందే తమకు తల్లికి వందనం నిధులు చెల్లించాలని విద్యార్థుల తండ్రులు సోమవారం కసాపురం జెడ్పీపీ హైస్కూల్‌లో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. కసాపురం గ్రామానికి చెందిన బెస్త మధుకుమార్, హేమలత కుమారుడు బి.అరవింద్ కసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బోయ శ్రీరాములు, చౌడేశ్వరి కుమారుడు బోయ అరవింద్ కూడా పదో తరగతి చదువుతున్నాడు. అయితే తల్లికి వందనం నిధుల మంజూరులో భాగంగా వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసే క్రమంలో సిబ్బంది బోయ అరవింద్ తల్లిదండ్రుల ఆధార్ నెంబర్లనే బి.అరవింద్‌కు కూడా నమోదు చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన జిలకర ప్రకాష్ కుమారుడు తలసీ భార్గవ్ వివరాల నమోదులోనూ తల్లిదండ్రుల ఆధార్ నెంబర్లు కాకుండా ఇతరులవి నమోదు చేశారు. దీంతో సంబంధిత విద్యార్థులకు తల్లికి వందనం నిధులు మంజూరు కాలేదు. ఈ క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం పాఠశాల వద్దకు చేరుకుని తమకు తల్లికి వందనం నిధులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం వేణుగోపాల్ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించగా అసలు విషయం బయటపడింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. మీరు చేసిన తప్పుకు మమ్మల్ని బాధ్యుల్ని చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారే మాకు డబ్బు చెల్లించాలని భీష్మించారు. విషయం ఎంఈఓ మస్తాన్‌రావు దృష్టికి వెళ్లడంతో ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో వారు శాంతించారు.

రైల్వే లైన్‌ను మార్పు చేయాలంటూ వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు - దోనిముక్కల గ్రామాల మధ్య నూతనంగా రైల్వే లైన్ రానున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆ పనులను మార్పు చేస్తూ పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో రైల్వే లైన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గుంతకల్లు పట్టణంలో మార్కెట్, మెయిన్ బజార్, ధర్మవరం రైల్వే గేట్, కసాపురం రైల్వే బ్రిడ్జి , షాపింగ్ మాల్ ఇలా అన్ని కలిసి కేవలం రెండు కిలోమీటర్ల లోపే ఉండటం వల్ల పట్టణంలో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తోడు పట్టణంలో మురుగు నీటి సమస్య, వర్షపు నీటి సమస్య కూడా అధికంగా ఉందన్నారు. శ్రావణమాసంలో నెట్టికంటుడి దర్శనానికి వచ్చే భక్తులు, వాహనాలతో కసాపురం రైల్వే బ్రిడ్జి రోడ్డు గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని, దోనిముక్కల -గుంతకల్లు మధ్య నిర్మించనున్న రైల్వే లైన్‌ను పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు విన్నవించారు. నాయకులు వడ్డే రమేష్, హనుమంతు, క్రిష్ణ, హరిక్రిష్ణ తదితరులు ఉన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న భూమిరెడ్డి ట్రస్ట్ సభ్యులు

పుట్లూరు: మండలకేంద్రంలోని కేజీబీవీలో సోమవారం భూమిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూఎస్ఏలో వైద్యురాలిగా ఉన్న డాక్టర్ ప్రవీణ సోలిపురం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్‌పై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ 9 సంవత్సరాల వయస్సు నుంచి 26 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న వారికి అందిస్తారన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, వ్యాక్సిన్ ధర రూ.3వేలు ఉంటుందన్నారు. కేజీబీవీలోని విద్యార్థులకు వారి తల్లిదండ్రుల అనుమతితో ఉచితంగా అందించడానికి డాక్టర్ ప్రవీణ సోలిపురం, అనీషా చెరుకు, దీక్షిత, తివిష దేవిరెడ్డి, మీహిక దేవిరెడ్డి, ఇషికా పోచంలు యూఎస్ఏలో నిధులను జమ చేసినట్లు వివరించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను త్వరలో విద్యార్థినులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో భూమిరెడ్డి ట్రస్ట్ సభ్యులు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, భూమిరెడ్డి సునీత, మండల వైద్యాధికారి శ్రీవాణి, స్పెషల్ ఆఫీసర్ మాధవి, పెద్దనారాయణ రెడ్డి, సీఆర్టీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

గార్లదిన్నె: ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ స్టేషన్ మేనేజర్ అభిమన్యుదాస్ సూచించారు. సోమవారం హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు ఆధ్వర్యంలో మండలంలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు స్వచ్ఛ భారత్ మిషన్, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఎల్‌పీజీ పైప్ లైన్ గురించి అవ గాహన కల్పించడంతోపాటు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, ఆటలపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలకు తడి, పొడి చెత్త డస్ట్ బిన్లు, పర్యావరణహిత మైన జూట్ బ్యాగులు, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతకు ఉపయోగపడే కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ కంపెనీ మేనేజర్ నాగార్జునరెడ్డి, భరత్ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ ముకుందరాఘవ, సీనియర్ ఆఫీసర్ సాయి ప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన దీక్షలు

తాడిపత్రి రూరల్/గుత్తి: రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా తాడిపత్రి మునిసిపాలిటీలోని ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల దీక్ష సోమవారం రెండో రోజుకు చేరింది. పట్టణంలోని సీబీరోడ్డులో ఉన్న పాత మునిసిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులు దీక్ష చేపట్టారు. అలాగే డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గుత్తిలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించుకోవాలి

గుత్తి రూరల్: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి ప్రజలపై భారం వేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చి సామాన్య ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, రేణుక, మల్లికార్జున, మల్లేష్, మున్ని, బావమ్మ, రెడ్డమ్మ, నారాయణస్వామి, మారి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, డీవైఎఫ్ఐ నాయకులు అశోక్, చందు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలసిన నృత్య విద్యార్థులు



గవర్నర్‌తో వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు సోమవారం విజయవాడలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. మే 9న ఉత్తరాఖాండ్‌లోని తుంగనాథ్ ఆలయం వద్ద -3 డిగ్రీల సెల్సియస్ వద్ద సముద్రమట్టానికి 12,078 అడుగులపైన విద్యార్థుల భరతనాట్య ప్రదర్శనకు ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానం మేరకు విద్యార్థులు, అకాడమీ నిర్వాహకులు వందన తదితరులు గవర్నర్‌ను కలిశారు. అకాడమీ విద్యార్థులు సాయిమైత్రి, జ్యోషిత, హాసిని, నవ్యశ్రీ, నిహారిక, గీర్వాణి, నిధిశ్రీ, అనిశా, హరిప్రియ, చిన్మయి, నిహారిక, ఆరదహ్య, శ్రీశాన్విత తదితరులను గవర్నర్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: విజయవాడ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్థానిక భోగేశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాలతో పాటు విఠోబస్వామి దేవస్థానాల ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ ఏ క్రిష్ణయ్య సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫారం-2లో చిరునామా నమోదు చేసి అనంతపురం దేవదాయశాఖ కార్యాలయానికి 20 రోజుల్లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

నేడు పామిడమ్మ తేరు

పామిడి: పట్టణంలో ఆషాఢ బహుళ పంచమిని పురస్కరించుకొని మంగళవారం పామిడమ్మ తేరు నిర్వహించనున్నారు. ఏటా ఉట్లతేరు ఉత్సవం ముగిసిన తర్వాత వచ్చే మంగళవారం పామిడమ్మ తేరు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహిమాన్వితురాలైన పామిడమ్మను పూజించుట ద్వారా పామిడి సుభిక్షంగా ఉంటుందన్నది ఇక్కడి వారి నమ్మకం. అలాగే యువత ఇరుసు పందేలతో బల ప్రదర్శన ఆనవాయితీగా మారింది.

పత్తి రైతులను ఆదుకోవాలి

యాడికి: పత్తి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు పీసీ వెంకటనాయుడు, రాగుల వెంకటరమిరెడ్డి తదితరులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావం వల్ల మండలంలోని నిట్టూరు, చిక్కేపల్లి, కమలపాడు, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంట ఎండిపోతోందన్నారు. దీంతో రైతులు తొలగిస్తున్నారు. సోమవారం ఉదయం పొలాలకు వెళ్లి రైతులను కలవగా భారీ పెట్టుబడులు పెట్టి పత్తి పైర్లు వేయగా ప్రస్తుతం వర్షం లేక పైర్లు ఎండిపోతుండగా ట్రాక్టర్లతో పంటను తొలగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

పెద్దవడుగూరు: రైతులు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలని సీపీఐ మండల నాయకుడు నారాయణ, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ అనంతపురాన్ని కరువు జిల్లా ప్రకటించాలని కోరారు. ఇప్పటికే రైతుల రూ.లక్షల పెట్టుబడులు పెట్టి వర్షాలు రాక తీవ్రంగా నష్ట పోయారనిన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రంగనాయకులు, ఏఐటీయూసీ నాయకుడు ఉసేన్‌పీరా, రైతు సంఘం నాయకులు నాగేంద్ర, సుధాకర్‌గౌడ్, రఘురామయ్య, శ్రీనివాసులు, మల్లికార్జునయ్య, ఓంనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయరా?

గార్లదిన్నె: అగ్రకులం వారు దాడి చేశారని ఆరురోజుల క్రితం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో దళితులు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయరా అంటూ శింగనమల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల ంలోని పాత కల్లూరుకు చెందిన అభి, సంతోష్, సుగుణమ్మ అనే తల్లీ కుమారులు తమపై అదే గ్రామానికి చెందిన అగ్రకులం వారు దాడి చేశారని, ఈ నెల 9న గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు . అయినా ఇప్పటి వరకూ గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయకపోవడం అంతర్యం మేమిటన్నారు. వీటిపై అనేక కారణాలు వినిపిస్తున్నాయన్నారు. పోలీసులు స్పందించి దళితులపై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో దళిత సంఘాలను కలుపుకుని గార్లదిన్నె పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

'పుణ్యక్షేత్రాన్ని రక్తక్షేత్రంగా మార్చకండి'

పామిడి: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రాన్ని రక్తక్షేత్రంగా మార్చకుండా కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సాకే గోవింద్ అన్నారు. సోమవారం పామిడిలో ఆయన మాట్లాడారు. ఆ క్షేత్రంలోని గిరి దర్శనానికి లక్షల్లో భక్తులు కలుస్తుంటారన్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రానికి చెందిన ఓ భక్తుడిని దుండగులు రూ.500 కోసం కత్తులతో గొంతుకోసి హతమార్చడం దారుణమన్నారు. తమిళనాడు ప్రభుత్వం మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50 లక్షల పరిహారం ప్రకటించాలన్నారు.

రెండుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) అనంతపురం మార్కెట్ యార్డు నుంచి మొక్క జొన్న కంకులను ఆటోలో లోడు చేసుకుని ఆదివారం వేకువజామున తిరుగు ప్రయాణమై, కల్లూరు పెన్నానది బ్రిడ్జి వద్ద ఆటో టైర్ మారుస్తుండగా కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరియమ్మ, ఉమాదేవిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక ఉమాదేవి (38) మృతి చెందింది. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు.